# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-11-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **విశాఖపట్నంలో సీఐఐ భాగస్వామ్య సదస్సును ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ రోజు ప్రారంభించారు.**

2. **పారదర్శకమైన వాణిజ్య విధానాలకు భారత్ కేంద్రంగా ఉందని కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్ తెలిపారు.**

3. **భారతదేశ తూర్పుతీరానికి ఆంధ్రప్రదేశ్ ముఖద్వారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**

4. **దేశవ్యాప్తంగా జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఈ రోజు నుంచి నిర్వహిస్తున్నారు.**

5. **ప్రపంచ మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

========================

విశాఖపట్నంలో 30వ భారత పరిశ్రమల సమాఖ్య – సీఐఐ భాగస్వామ్య సదస్సు ఈ రోజు ప్రారంభమైంది. ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఈ సదస్సును ప్రారంభించారు. గవర్నర్ జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రులు పీయూష్‌గోయల్, రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, భూపతిరాజు శ్రీనివాస వర్మ సదస్సుకు హాజరయ్యారు. ఈ సదస్సుకు సీఐఐ అధ్యక్షుడు రాజీవ్ మెమానీ, సీఐఐ డైరెక్టర్ చంద్రజిత్ బెనర్జీతోపాటు దేశవిదేశాలకు చెందిన పారిశ్రామికవేత్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, దేశంలో పెట్టుబడులుకు ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానంగా నిలుస్తోందన్నారు. దేశంలోనూ, ఆంధ్రప్రదేశ్ లోనూ పెట్టుబడులు పెట్టడానికి ఇదే సరైన సమయం అని ఉపరాష్ట్రపతి పేర్కొంటూ,

వాయిస్ 30 సెకన్లు

ఈ సదస్సులో పాల్గొన్న కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్‌గోయల్ మాట్లాడుతూ, స్వేచ్ఛా వాణిజ్యం కోసం వివిధ దేశాలతో ఒప్పందాలు చేసుకుని దానికి అనుగుణంగా వాణిజ్య బంధాలను బలోపేతం చేస్తున్నామన్నారు. డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్ దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు అత్యంత పారదర్శకమైన వాణిజ్య విధానాలకు భారత్ కట్టుబడి ఉంటుందని కేంద్రమంత్రి తెలియజేస్తూ,

వాయిస్ 27 సెకన్లు

---------------------------

భాగస్వామ్య సదస్సుకు హాజరవుతున్న అతిథులకు ఆహ్వానం పలుకుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందించారు. వైజాగ్ అంటే దార్శనికత, ఆవిష్కరణ, ఉత్సాహం, ఆశయం, వృద్ధి అనేది కొత్త నిర్వచనమని తెలిపారు. పెట్టుబడులకు ఆంధ్రప్రదేశ్ సరైన వేదిక అనే అంశాన్ని ప్రతిబింబించేలా రెండు రోజుల జ×× భాగస్వామ్య సదస్సు జరుగుతోందన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం అందరికీ అర్థమయ్యేలా.. రాష్ట్రంలో ఉన్న అపార అవకాశాలను వివరించేలా సదస్సును నిర్వహిస్తున్నామని తెలిపారు. అందరి సహకారాన్ని, అభివృద్ధిని కాంక్షిస్తూ సీఐఐ భాగస్వామ్య సదస్సు జరుపుతున్నామని పేర్కొన్నారు.

---------------------------

భారతదేశ తూర్పుతీరానికి ఆంధ్రప్రదేశ్ ముఖద్వారంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. విశాఖపట్నంలో ప్రారంభమైన సీఐఐ భాగస్వామ్య సదస్సులో ముఖ్యమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ, 2047నాటికి భారత్ బలమైన ఆర్థిక వ్యవస్థగా నిలుస్తుందని వ్యాఖ్యానించారు. సువిశాలమైన సముద్ర తీరం, తగినన్ని వనరులు ఆంధ్రప్రదేశ్ లో అందుబాటులో ఉన్నాయన్నారు. పెట్టుబడులు పెట్టేవారికి అన్ని వసతులు కల్పిస్తామని ముఖ్యమంత్రి పేర్కొంటూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా రాష్ట్ర పర్యాటక రంగంలో పెట్టుబడులు రానున్నాయని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విశాఖపట్నంలో జరుగుతున్న భాగస్వామ్య సదస్సులో టూరిజం స్టాల్ ను మంత్రి ఈ రోజు ప్రారంభించారు. రాష్టంలోని పర్యాటక ప్రాంతాలను తెలుసుకునేలా ఏర్పాటుచేసిన టచ్ క్యూయోస్ మెషిన్ ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పర్యాటక రంగంలో దాదాపు 100 అవగాహన ఒప్పందాలు చేసుకుంటున్నామన్నారు. సాంకేతికత ద్వారా పర్యాటకులకు అరకు, గండికోట వంటి పర్యాటక అనుభవాలను తెలిపేలా అందించే క్యూయోస్ మెషిన్ ను ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు.

---------------------------

దేశవ్యాప్తంగా ఈ రోజు నుంచి 20వ తేదీ వరకు జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. 1919లో ఆంధ్ర గ్రంథాలయ సంఘం ఆధ్వర్యంలో అయ్యంకి వెంకటరమణయ్య మద్రాస్‌లో రెండు రోజులపాటు నవంబర్ 14, 15 తేదీలలో జాతీయ గ్రంథాలయ సదస్సును నిర్వహించారు. తెలుగువారు విజయవంతంగా నిర్వహించిన తొలి జాతీయ సదస్సు జరిగిన తేదీలను జాతీయ గ్రంథాలయ దినోత్సవంగా ప్రకటించారు. 1968 నుంచి భారత ప్రభుత్వం గ్రంథాలయాలకు జాతీయ స్థాయిలో వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది. అప్పటి నుండి ప్రతి యేటా వారం రోజులపాటు నవంబర్ 14 నుండి 20వ తారీకు వరకు గ్రంథాలయ వారోత్సవాలను నిర్వహిస్తున్నారు.

---------------------------

పారిశ్రామికరంగం అభివృద్దికి వన్ మిషన్, వన్ విజన్ అనే విధానంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్,తెలిపారు. విశాఖపట్నం భాగస్వామ్య సదస్సులో కేంద్రమంత్రి పాల్గొని ప్రసంగిస్తూ, వివిధ రంగాల్లోని పెట్టుబడులకు నమ్మకమైన భాగస్వామిగా

ఆంధ్రప్రదేశ్ నిలుస్తోందన్నారు. వ్యవసాయం రంగం నుంచి అంతరిక్ష రంగం వరకూ వివిధ రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయని వివరించారు.

---------------------------

ప్రపంచ మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు. మధుమేహ వ్యాధి నియంత్రణకు దోహదం చేసే ఇన్సులిన్ కనుగొన్న సర్ ఫ్రెడరిక్ గ్రాంట్ బాంటింగ్ జయంతిని మధుమేహ వ్యాధి అవగాహనా దినోత్సవంగా జరుపుకుంటున్నారు. మానవ రక్తంలో అధిక మోతాదులో చక్కెర నేరుగా కలవడం వల్ల రోగ నిరోధక వ్యవస్థ పై ప్రతికూల ప్రభావం చూపి ప్రాణాలకే ముప్పుగా పరిణిమిస్తుంది. దీనినే మధుమేహం అంటారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆహార నియమాలు పాటించడం ద్వారా మధుమేహ వ్యాధిని నియంత్రించ వచ్చునని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

---------------------------

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన గిరిజన యోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి వారసత్వాన్ని, సంస్కృతిని గౌరవిస్తూ గిరిజన స్వాభిమాన ఉత్సవాలు నిర్వహిస్తున్నామని తూర్పుగోదావరి జిల్లా గిరిజన సంక్షేమ అధికారి కె.ఎన్. జ్యోతి తెలిపారు. భగవాన్ బిర్సా ముండా 150వ జయంతోత్సవాలలో భాగంగా రాజమహేంద్రవరంలోని బొమ్మూరు గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో సంప్రదాయ గిరిజన వస్త్రధారణ కార్యక్రమాన్ని నిన్న నిర్వహించారు.

---------------------------

పుట్టపర్తిలో నిర్వహించే సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు దేశంలోని ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ తెలిపారు. పుట్టపర్తిలో సత్యసాయి జయంతి వేడుకలను నిర్వహించే ప్రాంతాలను ఆయన నిన్న పరిశీలించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ, ఈనెల 19న ప్రధానమంత్రి నరేంద్రమోదీ, 22, 23 తేదీల్లో రాష్ట్రపతి ద్రౌపదిముర్ము, ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ పుట్టపర్తికి రానున్న దృష్ట్యా అత్యాధునిక కెమెరాలు, డ్రోన్లు, నైట్ విజన్ పరికరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాట్లు జరుగుతున్నాయని చెప్పారు. సత్యసాయి జయంతి వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు.

---------------------------

రాష్ట్రం లో చలి తీవ్రత పెరుగుతోందని కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, కర్నూలు, విశాఖపట్నం, అనకాపల్లి, నంద్యాల జిల్లాల్లో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 17 డిగ్రీల సెల్సియస్ లోపు నమోదవుతున్నాయని, అల్లూరి సీతారామరాజు జిల్లా జి.మాడుగులలో 7.6 డిగ్రీల సెల్సియస్ కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైందని వెల్లడించింది.

=====================